క్లుప్తంగా

బాల కార్మికులకు కౌన్సెలింగ్

నెల్లూరు సిటీ: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ క్రమంలో 16 మంది బాల కార్మికులను గుర్తించి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఉప కార్మిక కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు చేయూత



నెల్లూరు(క్రైమ్): ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్న కానిస్టేబుల్‌కు సహచర సిబ్బంది చేయూతనందించారు. కొండాపురం పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కావలికి చెందిన ప్రవీణ్ గత నెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చెన్నైలో చికిత్స పొంది ఇటీవలే ఇంటికొచ్చారు. ఈ క్రమంలో ఆయనకు చేయూతనిచ్చేందుకు బ్యాచ్ కానిస్టేబుళ్లు, సీనియర్లు, జూనియర్లు తమ వంతుగా రూ.82 వేలను సేకరించారు. ఈ మొత్తాన్ని ప్రవీణ్‌కు కావలిలో ఏఎస్సై రమణ, కానిస్టేబుళ్లు మస్తాన్, ప్రతాప్, మోహన్, రసూల్, కిరణ్‌కుమార్, సురేష్, రమేష్ అందజేశారు.

వైద్యానికి రూ.10 వేల సాయం



నెల్లూరు(బారకాసు): అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళ సుభాషిణి వైద్యం నిమిత్తం రూ.పది వేల సాయాన్ని గణేష్ సేవా మిత్రమండలి ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. మృత్యువుతో పోరాటం అనే శీర్షికన గత నెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. బీవీనగర్‌లో నివాసం ఉంటున్న సుభాషిణి ఇంటికెళ్లి ఈ మొత్తాన్ని ఆమె తల్లి మరియమ్మకు మిత్రమండలి సభ్యులు మోహన్, జోషిత్ అందజేశారు. మరో రూ.ఐదు వేలను త్వరలోనే అందజేస్తామని వారు చెప్పారు.

15న జూడో జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 19 జూనియర్ కళాశాలల జూడో బాలబాలికల జట్లను నాయుడుపేటలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంపిక చేయనున్నామని ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004, జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని చెప్పారు. పదో తరగతి మార్కుల లిస్టు, స్టడీ సర్టిఫికెట్‌ను తీసుకురావాలని సూచించారు. ఎంపికైన జిల్లా జట్టు అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయని తెలిపారు.

అమ్మపై గీతాలాపన రేపు

నెల్లూరు(బృందావనం): మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మపై సినీ గీతాలాపనల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నామని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవిందనగర్‌లోని మన హాస్పిటల్ ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, వివరాలకు 78938 47709 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వీణాగాన విభావరి నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో వీణాగాన విభావరిని ఎస్వీబీఎస్ సంగీత కళాపీఠ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నామని వీణా విద్వాంసురాలు వెంకట శ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. 35 మంది సంగీత కార్యక్రమంలో పాల్గొననున్నారని చెప్పారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేత్రదానం

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని సావిత్రినగర్‌కు చెందిన సీతారామమ్మ (79) తన నివాసంలో శుక్రవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు.

ఆహార పొట్లాల అందజేత

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని పేదలు, నిరాశ్రయులకు ఆహార పొట్లాలను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. దశరథరామిరెడ్డి, సౌందర్యరెడ్డి సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రమేష్‌బాబు, ధనుష్, శశికిరణ్, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనికేపల్లిలో రెండోరోజు శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. తొలుత రూ.5కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీలను మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తుది దశకు చేరుకుందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు సీఎం వైఎస్ జగన్ జనరంజక పాలనకు అద్దం పడుతున్నాయన్నారు. గతంలో ఎవ్వరూ అమలు చేయని విధంగా వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టి ప్రజల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాల హయాంలో నామమాత్రంగా శిలాఫలకాలు వేసి వదిలేసేవారని, కానీ సీఎం వైఎస్ జగన్ పాలనలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. అనికేపల్లి పంచాయతీలోనే రూ.5కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించామని తెలిపారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రూ.20వేల కోట్ల భూములకు శాశ్వత పరిష్కారం

రాష్ట్రంలో రూ.20వేల కోట్ల విలువైన చుక్కల భూములకు సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపారని మంత్రి కాకాణి తెలిపారు. చుక్కల భూములకు విముక్తి కల్పించేందుకు కావలి నిర్వహించిన సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు హాజరై విజయవంతం చేశారని చెప్పారు. గత రెండు దశాబ్దాలుగా చుక్కల భూముల సమస్యతో రైతులు ఆందోళనకు గురవుతుండగా, సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో నిషేధిత జాబితా నుంచి వాటిని తొలగించి పట్టా భూములుగా మార్చారని కొనియాడారు. రైతులు, మహిళలు, ఇతర అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. గతంలో పని చేసిన అందరి ఎమ్మెల్యేల హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో, అంతకు మించి తాను అభివృద్ధి పనులు చేయించినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైఎస్‌ఎంపీపీ కనుపూరు కోదండ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య, సర్పంచ్ కొమరిగిరి శీనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



మనుబోలు: సీఎం సభకు తరలివెళ్తున్న రైతులు



పొదలకూరు: సీఎం సభకు తరలివెళ్తున్న రైతులు

మనుబోలు: చుక్కల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి అమ్ముకునే హక్కు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని జట్లకొండూరు రైతులు పేర్కొన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో చుక్కల భూములకు విముక్తి కల్పించేందుకు కావలిలో శుక్రవారం నిర్వహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలంలోని రైతులు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మనుబోలు, జట్లకొండూరు ఉపసర్పంచ్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, తులసీరాం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చూపిన సీఎం వైఎస్ జగన్‌ను రైతులు ఎప్పటికీ మరచిపోరన్నారు. తమకు మేలు చేసేందుకు వస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపేందుకు రైతులు స్వచ్ఛందంగా తరలి వచ్చారని తెలిపారు. వారి వెంట వీఆర్వోలు భక్తవత్సలరెడ్డి, శ్రీనివాసులు, సర్వేయర్లు రాజ, ఫయాజ్, తదితరులు ఉన్నారు.

సీఎం సభకు తరలివెళ్లిన రైతులు

పొదలకూరు : చుక్కల భూముల రైతులకు విముక్తి కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలిలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభకు మండలంలోని రైతులు తరలివెళ్లారు. చుక్కల భూముల సమస్యల నుంచి విముక్తి పొందిన చెన్నారెడ్డిపల్లి, బత్తులపల్లి, నేదురుమల్లి, తదితర గ్రామాలకు చెందిన 35 మంది రైతులు స్వచ్ఛందంగా ప్రత్యేక వాహనంలో సీఎం సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని చుక్కల భూముల సమస్యలను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించి భూములకు హక్కులు కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కొడవలూరు: మండలంలోని ఆర్‌బీకేల్లో రైతులకు యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని ఏఓ సీహెచ్ లక్ష్మి తెలిపారు. గండవరం ఆర్‌బీకేలో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎడగారులో మంచి దిగుబడులు సాధించాలంటే పచ్చిరొట్ట పైర్ల సాగు తప్పనిసరని తెలిపారు. 50శాతం రాయితీపై జీలుగలు కిలో రూ.39.50 పిల్లిపెసర్లు కిలో 48.50, జనుములు కిలో రూ.42కు అందజేస్తున్నట్లు వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఏఏ టీ.కవిత, రైతులు పాల్గొన్నారు.



రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ఉచిత కంటి వైద్యశిబిరం

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెం సచివాలయంలో సెంబ్‌కార్ప్–ఎల్‌వీపీఈఐ కమ్యూనిటీ ఐ కేర్ సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో స్థానికులకే కాకుండా పరిసర గ్రామాల ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేసి, ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, వైద్యసిబ్బంది భవాని, సులోచన పాల్గొన్నారు.



తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ

ముత్తుకూరు: వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గండవరం సుగుణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత శాఖల వారీగా ప్రగతిని అధికారులు వివరించారు.అనంతరం కృష్ణపట్నం ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, తదితరులు మాట్లాడుతూ తమ పంచాయతీలో కొన్ని చోట్ల తాగునీరు సక్రమంగా అందడం లేదని అధికారులకు విన్నవించారు. ముత్తుకూరు ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్ అండ్‌ఆర్ కాలనీల్లో డ్రెయిన్లు నిర్మించాలని కోరారు. పూర్తి చేసిన అభివృద్ధి పనులకు ఫైనల్ బిల్లులు చెల్లించాలని వైస్‌ఎంపీపీ పోలిరెడ్డి చిన్నపరెడ్డి పీఆర్ ఇంజినీర్లను కోరారు. ఎంపీడీఓ ప్రత్యూష, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

రేపట్నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

పొదలకూరు : పట్టణంలోని పురాతన వీరఅభయాంజనేయస్వామి ఆలయం హనుమజ్జయంతి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 14న హనుమజ్జయంతి సందర్భంగా ఆలయంలో విశేషపూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. పద్నాలుగు వారాల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గతంలో ఈ సంప్రదాయం లేకున్నా గత ఐదేళ్లుగా పట్టణంలోని సామాజిక వర్గాల వారు ఉత్సవాలను చేపడుతున్నారు. తొలివారం ఆర్యవైశ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించనున్నారు.



ముస్తాబైన వీరాంజనేయస్వామి దేవస్థానం

నేడు ఈదూరుకు మంత్రి కాకాణి రాక

తోటపల్లిగూడూరు: మండలంలోని ఈదూరులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటలకు ఈదూరు గ్రామసచివాలయం పరిధిలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని చెప్పారు. మండలాధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కోవూరు: స్థానిక పెళ్లకూరు కాలనీ ప్రాంతంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొనాలని కోరారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బీ మురళీధర్ శుక్రవారం తెలిపారు. ఐటీఐ కళాశాలకు పొదలకూరుకు సమీపంలో చిట్టేపల్లి వద్ద శాశ్వత భవనం నిర్మించినట్టు తెలిపారు. సూయింగ్ టెక్నాలజీకి 8వ తరగతి, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, హార్టికల్చర్ కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఈ కోర్సులు ఏడాది నుంచి రెండేళ్ల కాలపరిమితితో ఉంటాయని చెప్పారు. అర్హులైన విద్యార్థులు జూన్8లోగా httpr.//iti.ap.go.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 89851 19940, 94948 31200, 94416 19149, 88868 86144 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ట్రక్ ఆటో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు నిలిపి ఉంచిన ట్రక్ ఆటో చోరీకి గురైంది. పోలీసుల సమాచారం మేరకు.. గుప్తా పార్కు సమీపంలోని శేషయ్యనాయుడివీధిలో నివాసం ఉంటున్న పాపారావుకు ట్రక్ ఆటో ఉంది. తన ఆటోను ఇంటి ముందు ఈ నెల తొమ్మిదో తేదీ రాత్రి నిలిపారు. మరుసటి రోజు ఉదయానికి ఆటో కనిపించకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

• కాపాడిన 108 సిబ్బంది

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన షేక్ సలీం కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లాలని స్థానిక డాక్టర్లు సూచించడంతో శుక్రవారం బస్సులో ప్రయాణమయ్యారు. అయితే బస్సు కొద్ది దూరం వెళ్లగానే సలీంకు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో బస్సులోనే పడిపోయాడు. దీంతో బస్సును డ్రైవర్ నిలిపివేసి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆత్మకూరు 108 సిబ్బంది నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకుని అతనికి ప్రాథమిక చికిత్స అందించి తిరిగి ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. డాక్టర్ హిమబిందు సలీంను పరిశీలించి అప్పటికే అతనికి ఫిట్స్ వ్యాధితో పాటు లివర్‌కు సంబంధించిన జబ్బు ఉందని ప్రత్యేక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లతో నెల్లూరుకు తరలిస్తామని డాక్టర్ హిమబిందు తెలిపారు.

నర్సుల సేవలు మరువలేనివి

కోవూరు: కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నర్సులు అందించిన సేవలు మరువలేనివని ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇనమడుగు పీహెచ్‌సీలో పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న 15 మంది నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పచ్చిపాల మాట్లాడుతూ నర్సుల సేవలను కొనియాడారు. కోవూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ విజేత మాట్లాడుతూ పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నర్సులను సత్కరించడం అభినందనీయమన్నారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్ నరసింహమూర్తి, అనూప్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు హితేష్‌కుమార్, మారుతితన్మై, తదితరులు పాల్గొన్నారు.



నర్సులను సత్కరిస్తున్న దృశ్యం

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఉత్సవారంభ స్నపనం, సాయంత్రం అంకురార్పణ, వైనతేయపటాధివాసం, తదితర పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కమిటీ చైర్మన్ పెండ్యాల రమణయ్యనాయుడు, కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు మన్యం శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేసవి శిబిరంలో ఆట విడుపు

కొడవలూరు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు దేశంలోని ప్రముఖుల జీవితచరిత్రలను తెలియజేశారు. నీతి కథలు చదివించడం, రాయించడం చేశారు. విరామ సమయంలో కబడ్డీ, కేరమ్స్, స్కిప్పింగ్ ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రాజేశ్వరి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండబారిన పడకుండా గ్రంథాలయాలకు రావడం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు.



గ్రంథాలయ ఆవరణలో కబడ్డీ ఆడుతున్న చిన్నారులు

పట్టపగలు చోరీపై పోలీసుల విచారణ

వెంకటాచలం: చెముడుగుంటలోని కాకి రమేష్ నివాసంలో గురువారం పట్టపగలు దొంగలు చోరీకి పాల్పడిన ఘటనపై పోలీసులు శుక్రవారం విచారణ చేపట్టారు. రమేష్ నివాసానికి ముందు వైపు తాళాలు వేసి ఉండగా, వెనుక వైపు తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు రూ.1.50లక్షల నగదు, 25సవర్ల బంగారు నగలను చోరీ చేశారు. చోరీ మధ్యాహ్నం 12 నుంచి 1.30గంటల మధ్యన జరిగింది. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని ముగ్గురు యువకులు ఒకే మోటారు బైక్‌పై చెముడుగుంటకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో తిరుగుతూ కనిపించారని స్థానికులు పోలీసులకు తెలిపారు. రమేష్ చుట్టుపక్కల నివాసాల వారిని విచారించిన పోలీసులు క్లూస్‌టీంతో వేలి ముద్రలు సేకరించారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న వివిధ కంపెనీల సీసీ కెమెరాలను పరిశీలించి మాస్కులు ధరించి మోటారు బైక్‌పై వెళ్లిన ముగ్గురు వ్యక్తుల వివరాలు సేకరిస్తే ఆధారాలు లభిస్తాయనే కోణంలో పోలీసులు ఆలోచన చేస్తున్నారు. పట్టపగలు జాతీయ రహదారికి అతిసమీపంలోని నివాసంలో జరిగిన చోరీ కావడంతో కేసును త్వరితగతిన ఛేదించేందుకు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

బుచ్చిరెడ్డిపాళెం: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడ్ని పోలీస్‌లు ఫిర్యాదు చేసిన రెండు గంటల వ్యవధిలోని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై వీరప్రతాప్ వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని 20వ వార్డు ఇందిరా ప్రగతినగర్ గిరిజన కాలనీలో గంధళ్ల సంజీవయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. వారి ఏడేళ్ల కుమారుడు యోహాన్ గురువారం సాయంత్రం తల్లిదండ్రులు పనినుంచి రావడం ఆలస్యం కావడంతో వారిని వెతుక్కుంటూ వెళ్లి దారితప్పాడు. పని నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు కుమారుడి కోసం కాలనీ మొత్తం గాలించినా ఫలితం లేకుండాపోయింది. శుక్రవారం ఉదయం కూడా కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. అయినప్పటికీ కుమారుడి ఆచూకీ లభించలేదు. దీంతో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టి నాలుగు గంటల సమయంలో బుచ్చిరెడ్డిపాళెంలో బాలుడి ఆచూకీని గుర్తించారు. అనంతరం గిరిజనకాలనీ వలంటీర్ సాయంతో బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగించారు.



తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలుడు

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా శుక్రవారం నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, పూజా కార్యక్రమాలను మందిర ప్రధానార్చకుడు దాశరథి నారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా రామ్‌ప్రసాద్, అనూరాధ దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, కోశాధికారి మస్తాన్‌రావు, తదితరులు పర్యవేక్షించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

నెల్లూరు(టౌన్): ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని స్టోన్‌హౌస్‌పేటలోని ఆరెస్సార్ స్కూల్లో శుక్రవారం ప్రారంభించారు. 1998, 2008, 2018 డీఎస్సీ (ఎమ్టీఎస్)లో ఎస్జీటీలుగా నియమితులైన దాదాపు 300 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్సు సమన్వయకర్త రమేష్ మాట్లాడారు. శిక్షణ కార్యక్రమం ఐదు రోజుల పాటు జరగనుందని చెప్పారు. కోర్సు డైరెక్టర్‌గా డీఈఓ గంగా భవానీ వ్యవహరిస్తున్నారు. సీనియర్ డైట్ అధ్యాపకుడు బాలాజీ, జిల్లా రిసోర్స్ పర్సన్లు సుధాకర్, అంకయ్య, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రామారావు పాల్గొన్నారు.

